క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

ముస్తాబాద్: మండలంలోని గూడెంలోని శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఐదు రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు నూతనంగా నిర్మించిన యాగశాలను ప్రారంభించి, అగ్నిప్రతిష్ఠ, పూర్ణాహుతి, ధ్వజారోహణం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శ్రీకాంతచారి ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకల్లో నిత్యం విష్ణుసహస్ర పారాయణం, లలితా పారాయణం ఉంటుందన్నారు. సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీధర్, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అంజన్‌రావు, శ్రీనివాస్‌రావు, సురేందర్‌రావు పాల్గొన్నారు.

పుస్తె మెట్టెల వితరణ



పుస్తె మెట్టెలు అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన ఎలుసాని కొంరవ్వ–ఎల్లయ్య దంపతుల కూతురు మౌనిక వివాహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్ మంగళవారం పుస్తెమెట్టెలు, గాజులు, పట్టుచీర అందించారు. నాయకులు కొరెండ్ల మల్లారెడ్డి, శీలం రాజు, గుండెల్లి వేణు, తడక విజయ్, బొమ్మిడి స్వామి, వంగల సనత్, జిల్ల బాలనర్సయ్య పాల్గొన్నారు.

బీజేపీ అప్రజాస్వామిక విధానాలపై పోరాటం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కోడం రమణ

సిరిసిల్లటౌన్: బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం తప్పదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 7న చేపడుతున్న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమం పోస్టర్లను ఆయన మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. రైతులు, కార్మికుల వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చిన బీజేపీకి బుద్ధిచెప్పాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. ఉపాధి హామీ పనులు కుదించడం, కార్మికులకు కనీస కూలీ రోజుకు రూ.600 అమలు చేయాలని, ఉపాధి హామీని పట్టణాలకు కూడా విస్తరింపజేయాలని తదితర సమస్యలపై ఈ కార్యక్రమం చేపడుతుందన్నారు. కార్యక్రమానికి కార్మిక, కర్షక, ఉద్యోగులు, మేధావి, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామంచ అశోక్, చిలుక బాబు, మోర అజయ్ పాల్గొన్నారు.

రంగుల సంబరం



వేములవాడఅర్బన్: రాజన్న ఆలయం ఎదుట..



వేములవాడరూరల్: మర్రిపల్లిలో హోలీ వేడుకల్లో పాల్గొన్న అధికారులు



చందుర్తి: వేడుకల్లో ఉపాధ్యాయులు



ముస్తాబాద్: గూడెంలో హోలీ కేరింత

జిల్లాలో హోలీ సంబురాలు ఉత్సాహంగా జరుపుకున్నారు. యువత, చిన్న పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని కేరింతలు కొడుతూ సంబురాల్లో మునిగి తేలారు. యువకులు బైక్‌లపై తిరుగుతూ హల్‌చల్ చేశారు. యువతులు, మహిళలు వేడుకల్లో డ్యాన్స్ చేస్తూ, కోలాటాలాడుతూ సందడి చేశారు. ఎల్లారెడ్డిపేటలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పొత్తూరులో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీలు జనగామ శరత్‌రావు, పిల్లి రేణుక, పడిగెల మానస, జెడ్పీటీసీలు గుండం నర్సయ్య, చీటీ లక్ష్మణ్‌రావు, పూర్మాని మంజుల, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సీఐ మొగిలి, ఎస్సై శేఖర్, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగారావు పాల్గొన్నారు.

– సిరిసిల్లఅర్బన్/వేములవాడఅర్బన్/వేములవాడరూరల్/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/తంగళ్లపల్లి/ చందుర్తి/వీర్నపల్లి/బోయినపల్లి/కోనరావుపేట/గంభీరావుపేట



నామాపూర్‌లో హోలీ ఆడుతున్న ట్రెయినీ ఐఏఎస్ అధికారులు



ముస్తాబాద్: హోలీ ఆడుతున్న ఎంపీపీ శరత్‌రావు



చందుర్తిలో చిన్నారుల హోలీ సంబరాలు



ఎల్లారెడ్డిపేటలో హోలీ ఆడుతున్న ఆగయ్య



ఎల్లారెడ్డిపేట: హోలీ ఆడుతున్న యువకులు



తంగళ్లపల్లి: సంబరాల్లో నాయకులు



వేములవాడఅర్బన్: రుద్రవరంలో



వేములవాడఅర్బన్: నాంపల్లిలో చిన్నారులు

కమలం గూటికి బీఆర్ఎస్ కీలక నాయకులు



చక్రధర్‌రెడ్డి

ముస్తాబాద్/గంభీరావుపేట: మంత్రి కేటీఆర్‌కు అత్యంత సన్నిహితులైన ఇద్దరు నాయకులు బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలోకి చేరుతున్నట్లు ప్రకటించారు. ముస్తాబాద్ సింగిల్‌విండో మాజీ చైర్మన్, రెడ్డి సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కనమేని చక్రధర్‌రెడ్డి, గంభీరావుపేట మండల మాజీ సెస్ డైరెక్టర్ కొక్కు దేవేందర్‌యాదవ్, ఆయన సతీమణి ముస్తఫానగర్ సర్పంచ్ సంధ్యారాణి ఈనెల 9న హైదరాబాద్‌లో బీజేపీలోకి చేరుతున్నట్లు ప్రకటించారు. వీరు బీఆర్ఎస్‌ను వీడడంపై రెండు మండలాల్లో చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా చక్రధర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కమిట్‌మెంట్‌తో పనిచేశానని, మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు అప్పగించిన బాధ్యతలు నేరవేర్చనన్నారు. సహకార సంఘాన్ని ఏ గ్రేడులోకి తీసుకువచ్చి, సొంత భవనం, రైతు ఫంక్షన్ హాల్ నిర్మించామన్నారు. బీఆర్ఎస్‌లో ఇమడలేక పార్టీ వీడుతున్నట్లు తెలిపారు. తనతోపాటు మరికొంత మంది రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ఆహ్వానం మేరకు బీజేపీలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు జిల్లాలో బీజేపీ బలోపేతానికి పనిచేస్తానన్నారు. అలాగే కొక్కు దేవేందర్‌యాదవ్ ముస్తఫానగర్ సర్పంచ్‌గా రెండు పర్యాయాలు పనిచేశారు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా వ్యవహరిస్తూ సెస్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు.



దేవేందర్‌యాదవ్ తో చర్చిస్తున్న నాయకులు

మహిళా దినోత్సవం



సిరిసిల్లఅర్బన్/గంభీరావుపేట: సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లోని బస్తీ దవాఖానా, గంభీరావుపేట కేజీ టు పీజీ క్యాంపస్‌లో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

వీర్నపల్లి: మండలంలో అడవిపదిర గ్రామంలో పొలం మధ్యలోనే వంగిపోయిన విద్యుత్ స్తంభం వల్ల ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందో అని రైతులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సెస్ అధికారులు వెంటనే విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: దివ్య, సెస్ ఏఈ
ఫోన్ నంబర్: 94408 14081

బీజేపీ మండల అధ్యక్షుడి తొలగింపునకు రంగం సిద్ధం

- కొత్త అధ్యక్షుడిగా రవికిషోర్..?
- పార్టీ వర్గాల్లో గుసగుసలు

వేములవాడరూరల్: బీజేపీ వేములవాడరూరల్ మండల అధ్యక్ష స్థానం నుంచి జక్కుల తిరుపతిని తొలగించేందుకు రంగం సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. వైస్‌ఎంపీపీ కవిత భర్త అయిన తిరుపతి స్థానంలో కొత్త అధ్యక్షుడిని నియమించేందుకు జిల్లా నాయకత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పర్యటనలో పార్టీకి ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో పాటు కొన్ని రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లు ఆరోపణలున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఆయనను తొలగించేందుకు అధిష్టానానికి ప్రతిపాదించినట్లు తెలిసింది.

కొత్త అధ్యక్షుడిగా రవికిషోర్

మండల బీజేపీ అధ్యక్షుడిగా చెట్టిపల్లి రవికిషోర్ నియామకం దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అధ్యక్షుడిగా కొనసాగుతున్న జక్కుల తిరుపతికి జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగిస్తూ రూరల్ అధ్యక్షుడిగా నాగాయపల్లి గ్రామానికి చెందిన రవికిషోర్‌కు మండల అధ్యక్ష బాధ్యతలను అప్పగించేందుకు బీజేపీ జిల్లా అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొన్నేళ్లుగా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న రవికిషోర్ పార్టీ బలోపేతానికి గ్రామీణ ప్రాంతాల్లో కృషి చేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆయనకు బాధ్యతలు అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది.

'డబుల్' ఇళ్లు నిర్మించాలి

ఇల్లంతకుంట: మండలంలోని ఊరూరా డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేయాలని బీఎస్పీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల లింగన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల సమయంలో ఇళ్లు లేని నిరుపేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి తొమ్మిదేళ్ల కాలంగా ఇచ్చిన హామీని నెరవేర్చడం లేదన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చాంపియన్ ట్రోఫీ విజేత మద్దిమల్ల

వీర్నపల్లి: మండల క్రికెట్ చాంపియన్ ట్రోఫీ విజేతగా మద్దిమల్ల జట్టు నిలిచింది. వీర్నపల్లితో జరిగిన ఫైనల్ మ్యాచ్ గెలిచి మొదటి బహుమతి రూ.5 వేల నగదుతో పాటు ట్రోఫీ అందుకుంది, స్థానిక సర్పంచ్ పాటి దినాకర్, ఎంపీటీసీ మల్లారపు అరుణ్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'సస్పెన్షన్ సిగ్గుచేటు'

తంగళ్లపల్లి: మంచిని మంచి అన్నందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేయడం సిగ్గుచేటు అని చిన్నలింగాపూర్ ఎంపీటీసీ బైరినేని రాము మంగళవారం ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలానికి చెందిన 500 మంది రైతుల పంట పొలాలు ఎండిపోకుండా రంగనాయకసాగర్ నుంచి నీటిని అందించిన మంత్రి కేటీఆర్‌కు రైతులతోపాటు క్షీరాభిషేకం చేయడం తప్పుగా పరిగణించడం సరికాదని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో తానెప్పుడూ ముందుంటానని, తనను సస్పెండ్ చేయడం జిల్లా అధ్యక్షుడి విజ్ఞతకే వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు.

కోతుల బెడదకు చెక్

కోనరావుపేట: గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువ అయ్యింది. ఊర్లపై పడి నానా హంగామా సృష్టిస్తున్న కోతుల నుంచి రక్షణకు నిజామాబాద్ సర్పంచ్ కేతిరెడ్డి అరుణ గ్రామస్తులతో చర్చించి ఒక నిర్ణయానికి వచ్చారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి కోతులు పట్టేవారిని పిలిపించి ఆ పని అప్పగించారు. మంగళవారం రంగంలోకి దిగిన వారు వాటిని పట్టి బోనులో బంధించారు. వాటిని తీసుకెళ్లి ఆదిలాబాద్ అడవుల్లో వదిలిపెడతారని, ఇందుకు గాను ఒక్క కోతికి రూ.500 చొప్పున చెల్లిస్తున్నట్లు తెలిపారు.

వరుస దొంగతనాలతో బెంబేలు

- ఆలయాలు, తాళాలున్న ఇళ్లే లక్ష్యం
- పోలీసులకు సవాల్
- నిఘా పెంచిన పోలీస్ యంత్రాంగం

ముస్తాబాద్: వరుస దొంగతనాలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలో పలు గ్రామాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. మరోవైపు దొంగల పట్టివేతకు పోలీస్ అధికారులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాయి. మండలంలో జరుగుతున్న చోరీలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. పోలీసులు ఒకవైపు నిఘా, పెట్రోలింగ్ చేపడుతున్నా, మారుమూల కాలనీలు, గల్లీల్లో తాళాలు వున్న ఇళ్లే లక్ష్యంగా వరుస చోరీలు జరుగుతున్నాయి.

జరిగిన చోరీలు..

➡ ముస్తాబాద్‌లో అక్షయ జ్యువెలరీస్‌లో, బ్యాంగిల్ స్టోర్‌లో, తాళ్ల రమేశ్‌రెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. సవాల్‌గా తీసుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు కామారెడ్డిలో దొంగ షేక్ సలీంను 24 గంటల వ్యవధిలో పట్టుకున్నారు. దొంగల వద్ద తులం బంగారం, 25 తులాల వెండి, నగదు 35 వేలు రికవరీ చేశారు.

➡ ముస్తాబాద్ కట్ట మైసమ్మ గుడిలో హుండీ ఎత్తుకెళ్లారు.

➡ ముస్తాబాద్ అయ్యప్ప ఆలయంలో హుండీ ఎత్తుకెళ్లారు. ఈ చోరీకి పాల్పడిన దొంగలు హన్మకొండ పోలీసులకు చిక్కారు.

➡ పోతుగల్ పారిపెల్లి వేణు ఇంట్లో చోరీ జరిగింది. వేణు కుటుంబంతో తీర్థయాత్రలకు వెళ్లగా, తాళం ఉన్న ఇంటిని బద్దలు కొట్టి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.2 వేల నగదును ఎత్తుకెళ్లారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్(ఫైల్)

➡ మోహినికుంట ఎల్లమ్మ ఆలయంలో దొంగతనం జరిగింది. ఆలయం గేట్‌ను బద్దలుకొట్టిన దొంగలు హుండీని పగలగొట్టి అందులోని బంగారు పుస్తె మెట్టెలతోపాటు, వెండి ఆభరణాలను, రూ.70 వేల వరకు నగదును దోచుకెళ్లారు.

➡ ముస్తాబాద్ మండల కేంద్రంలోని బుగ్గవ్వ అనే మహిళ ఇంట్లో దొంగలు పడ్డారు. హైదారాబాద్‌లో ఉంటున్న ఆమె ఇంటికి తాళం వుంది. బీరువాలోని పావుతులం బంగారం ఎత్తుకెళ్లారు.

➡ ముస్తాబాద్‌కు చెందిన నారాయణ, అన్నం సంతోష్, పోతుగల్‌కు చెందిన శ్రీనివాస్ ద్విచక్ర వాహనాలను అపహరించుకుపోయారు.

➡ ముస్తాబాద్ మండలం చీకోడు శ్రీలక్ష్మినర్సింహస్వామి ఆలయం తలుపులు బద్దలు కొట్టి దొంగతనానికి విఫలయత్నం చేశారు.

భద్రత కల్పించాలి



మండలంలో ఊరూరా ఎల్లమ్మ ఆలయాలు ఉన్నాయి. దొంగలు వాటిని లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. పోలీసులు ఆలయాల వద్ద భద్రత పటిష్టం చేయాలి. గౌడ సంఘం వారు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మంచిది.

– బాలరాజుగౌడ్,
గౌడ సంఘం అధ్యక్షుడు

గాలింపు చర్యలు చేపట్టాం



ముస్తాబాద్‌లో జరుగుతున్న చోరీలపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. అన్ని ఆధారాలు సేకరించాం. ఇప్పటికే పలు చోరీలకు పాల్పడ్డ ఇద్దరు దొంగలను అరెస్టు చేశాం. మోసాలు చేసిన వారిని అరెస్టు కూడా చేశాం. సీసీ కెమెరాలు, ఆధునిక సాంకేతిక పరికరాల సాయంతో దొంగలను పట్టుకుంటున్నాం.

– వెంకటేశ్వర్లు, ఎస్సై, ముస్తాబాద్

ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో పోలీసులు మంగళవారం డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన వారిని హెచ్చరించారు.

వేములవాడఅర్బన్: వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలుచోట్ల మంగళవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ టౌన్ సీఐ వెంకటేశ్ మాట్లాడుతూ హోలీ పండుగ పేరుతో అతిగా మద్యం సేవించి, వాహనం నడిపి ప్రమాదాల గురికాకుండా తాము పట్టణానికి మూడు వైపులా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు వెంకట్రాజం, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

పల్లెల్లో హోలీ ఆట పాటలు

- కొనసాగుతున్న సంప్రదాయం



హోలీ పాటలు పాడుతున్న మహిళలు

వేములవాడరూరల్: ''హోలీ.. హోలీర రంగ హోలీ.. చమ్మ కేళిర హోలీ అంటూ..'' మహిళలంతా గూడి ఇంటింటికి వెళ్లి హోలీ పాటలు పాడి ఇనామ్ తీసుకోవడం ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం. పూర్వం నుంచి వస్తున్న ఈ సంప్రదాయంలో హోలీ కోసం ప్రత్యేక బాణిలో పాడే పాటలు, డ్యాన్సులు పల్లె ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటాయి.